నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
బుధవారం | జనవరి 24, 2024 | www.navatelangana.com

డిగ్రీ కళాశాలలో సుభాష్ చంద్రబోస్ జయంతి

ఆదిలాబాద్‌టౌన్ : పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ డా. శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ఆజాద్ హింద్ ఫౌజ్ ఏర్పాటు చేశారని, ప్రతి సంవత్సరం ఆయన జన్మదినాన్ని పరాక్రమ దివస్‌గా జరుపుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో అకాడమిక్ కోఆర్డినేటర్ రఘునాథ్, జగ్రామ్ అంతర్వేది, తెలుగు అధ్యాపకులు రాదరపు సంతోష్ కుమార్, డాక్టర్ నర్సింగ్‌రావు, జంతుశాస్త్ర శాఖ అధిపతి విజయ్ కుమార్, ఎన్ఎస్ఎస్ ఎండి అశ్రఫ్ అలీ, రమేష్‌రెడ్డి, తిరుపతి, పీడీ అనిత, జోత్స్న పాల్గొన్నారు.



శనగ పంటను ఆశిస్తున్న పచ్చ, లద్దె పురుగు

నవతెలంగాణ-బజార్‌హత్నూర్

యాసంగిలో సాగవుతున్న శనగ పంటను పచ్చ, లద్దె పురుగులు ఆశిస్తున్నాయని జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య అన్నారు. మంగళవారం మండలంలోని చింతల సాంగ్వి, దాబాడి గ్రామాల్లోని శనగ పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో రైతులు శనగ పంటను అత్యధికంగా పండిస్తున్నారని తెలిపారు. శనగలో కొన్నిచోట్ల శనగ పచ్చ పురుగుతో పాటు లద్దె పురుగు సోకిందని తెలిపారు. వీటి నివారణకు నోవల్యురాన్ లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ మందులను పిచికారి చేయాలని సూచించారు. రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని పేర్కొన్నారు. ఆయన వెంట ఏఈఓలు రామ్, రాజేశ్వర్, గ్రామ రైతులు ఉన్నారు.



పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలి



ఆదిలాబాద్‌అర్బన్ : కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న దిశా నిర్దేశం చేశారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని, తమ ప్రభుత్వ హయాంలోని ఫలాలే పేదలు అనుభవిస్తున్నారని తెలిపారు. ఎన్నికల్లో పార్టీ ఓటమి పాలు కాలేదని, అమలు సాధ్యం కాని హామీలతో కాంగ్రెస్ గద్దెనెక్కిందని విమర్శించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందే వరకు ప్రతిపక్ష పాత్రలో ప్రజల పక్షాన ఉద్యమిస్తూనే ఉంటామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవానికి దేశ ప్రథమ పౌరురాలు రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఆహ్వానించకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. బీజేపీతో రాజీలేని పోరాటం చేస్తామన్నారు. పథకాల అమలులో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలమైందని, కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలే ప్రజలకు అందుతున్నాయన్నారు. ప్రజా సంక్షేమంలో ప్రజలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అందుకోసం బీఆర్ఎస్ కార్యకర్తలు నూతన ఉత్సాహంతో ప్రజల ముందుకు పోవాలని పేర్కొన్నారు. పార్టీని వీడిన వారి వల్ల ఎలాంటి నష్టం లేదని, పార్టీ సంస్థాగత ఎన్నికల్లో పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. రైతుబంధు, రైతు బీమా, రుణమాఫీ, వృద్ధాప్య, వితంతు పింఛన్లు వంటి పథకాలు లబ్ధిదారులకు అందకపోవడం కాంగ్రెస్ అసమర్థ పాలనకు నిదర్శనమన్నారు. రానున్న ఎంపీ ఎన్నికలలో కాంగ్రెస్, బిజెపి చతికిల పడటం ఖాయమని జోస్యం చెప్పారు. సమావేశంలో గ్రంథాలయ చైర్మన్ రౌతు మనోహర్, మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, ఆత్మ చైర్మన్ జిట్ట రమేష్, పట్టణ అధ్యక్షులు అజయ్, నాయకులు సాజిదొద్దీన్, ప్రమోద్‌రెడ్డి, సతీష్ పవర్, రోకండ్ల రమేష్, బుట్టి శివ, సలీం పాషా, దాసరి రమేష్, స్వరూపరాణి, బుడగం మమత, పర్వీన్‌భాను, పర్వీన్ ఫెరోజ్, దివిటి రాజు, కరుణ పాల్గొన్నారు.

సీఐటీయూ క్యాలెండర్ ఆవిష్కరించిన కలెక్టర్



ఆసిఫాబాద్: సీఐటీయూ క్యాలెండర్‌ను మంగళవారం కలెక్టర్ బోర్కడే హేమంత్ సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలు సమస్యలు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటీయు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజేందర్, ముంజం శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ఆర్ త్రివేణి, బాలకిషన్, సమ్మయ్య పాల్గొన్నారు.

ఫిబ్రవరి 16న నిరసనను విజయవంతం చేయాలి

కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా ఫిబ్రవరి 16న చేపట్టే నిరసన కార్యక్రమాలు విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు కోరారు. సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మికుల జీవితాలతో ఆటలాడుతోందన్నారు. రోజుకో చట్టం, పూటకో నిబంధనలతో శ్రమ దోపిడీ చేస్తోందని విమర్శించారు. నాలుగు లేబర్ కోడ్‌లు అమలు చేస్తూ కార్మికుల సంఘటిత శక్తిని విచ్ఛిన్నం చేస్తూ కార్మిక పోరాటాలను నిర్వీర్యం చేస్తుందన్నారు. మతం పేరుతో కార్మిక వర్గంలో సైతం విభజన తెస్తూ రాజ్యాంగ విలువల్ని కాలరాస్తుందని, నూతన మోటార్ వెహికల్ చట్టం ద్వారా ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల కుటుంబాలు రోడ్డున పడుతాయని పేర్కొన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా అయోధ్య పేరుతో మత రాజకీయాలు చేస్తూ దేశ ప్రజల దృష్టిని మళ్లించే కుట్ర చేస్తుందని విమర్శించారు. బిజెపి ప్రభుత్వం అవలంబించే అప్రజాస్వామిక కార్మిక, మతోన్మాద నియంతృత్వ విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా జనవరి నుండి ఫిబ్రవరి 16 వరకు జరిగే నిరసనల్లో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటీయు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాజేందర్, శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ఆర్.త్రివేణి, బాలకిషన్, సమ్మయ్య పాల్గొన్నారు.

బీజేపీ ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చాలి

- సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్
- ఆదిలాబాద్ అభివృద్ధి సాధన పోరాట కమిటీ ఏర్పాటు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సీసీఐ పునరుద్ధరణ, ఆదిలాబాద్ టూ ఆర్మూర్ రైల్వే లైన్ మంజూరు, విమానాశ్రయం నిర్మాణం కోసం 2024 బడ్జెట్ సమావేశాల్లోనే నిధులు కేటాయించాలని మంగళవారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో తీర్మానించారు. బీజేపీ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని వక్తలు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని యాదవ సంఘం భవనంలో సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు బండి దత్తాత్రి అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశానికి బీజేపీ మినహా వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు హాజరయ్యారు.

సీసీఐని పునఃప్రారంభించాలి

రౌండ్‌టేబుల్ సమావేశానికి హాజరైన వక్తలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పరిధిలోనే ఈ ప్రాంత అభివృద్ధికి సీసీఐ ఓ ప్రధాన వనరు అన్నారు. 1984లో నిర్మించిన సీసీఐతో ఇక్కడ వేలాది మందికి ఉపాధి లభించిందని, ప్రత్యక్షంగా, పరోక్షంగా 6వేల మందికి ఉపాధి కల్పించిన ఈ పరిశ్రమ 1998లో వాజ్‌పేయి ప్రభుత్వ హయాంలో మూతపడిందని తెలిపారు. గత ఎన్నికల్లో సీసీఐని తెరిపిస్తామన్న హామీతో ఇక్కడ నుంచి బీజేపీ పార్లమెంటులో అడుగుపెట్టిందని తెలిపారు. ప్రజలు నమ్మి ఓటేశారన్నారు. కానీ ఇచ్చిన హామీ నిలబెట్టుకోలేకపోయిందన్నారు. ఆదిలాబాద్ అసెంబ్లీ, పార్లమెంటు సభ్యులు, ఢిల్లీలో ప్రధాని వరకు వాళ్లే ఉన్నందున సిసిఐని తెరిపించేందుకు తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆ రోజు మూసేసిన పార్టీనే నేడు కేంద్రంలో అధికారంలో ఉందని, దాన్ని తెరిపించే బాధ్యతగా బీజేపీ భావించాలన్నారు. ఈ ప్రక్రియ ప్రారంభించకుండా మరోసారి ఓట్లడిగే అర్హత ఆ పార్టీకి లేదని పేర్కొన్నారు.

ఆదిలాబాద్ టూ ఆర్మూర్ రైల్వే లైన్ చేపట్టాలి

ఆదిలాబాద్ నుండి ఆర్మూర్ వరకు రైల్వేలైన్ ఏర్పాటు ఏండ్లుగా సర్వేల్లోనే మగ్గుతోందన్నారు. పూర్తిస్థాయిలో నిధులు కేటాయించి పనులు చేపట్టకుండా కేంద్రం తీవ్ర జాప్యం చేస్తోందని మండిపడ్డారు. ఫలితంగా ఇక్కడి ప్రజలకు రైల్వే ప్రయాణం భారంగా మారుతోందని, హైదరాబాద్ వెళ్లాలంటే మహారాష్ట్ర అంతా తిరుగుతూ 12గంటలు ప్రయాణం చేయాల్సి వస్తోందని తెలిపారు. ఇది ప్రారంభమైతే హైదరాబాద్‌కు రవాణా సదుపాయం మెరుగుపడి ప్రజలకు విద్యా, వైద్యం, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్

విమానాశ్రయానికి అనుకూలత

ఆదిలాబాద్ జిల్లాలో విమానాశ్రయం నిర్మాణానికి అన్ని అనుకూలతలున్నాయన్నారు. 369 ఎకరాలు స్వాతంత్రం కంటే ముందే కేటాయించారన్నారు. ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా పలుమార్లు సర్వేలు కూడా నిర్వహించిందని తెలిపారు. ఇక్కడ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అవసరమైన నేల కూడా అనుకూలంగానే ఉన్నట్లు నివేదిక ఇచ్చిందని, కానీ కేంద్రం నిర్మాణానికి నిధులు కేటాయింపులో తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా దీనిపై నిర్ణయం తీసుకొని వెంటనే విమానాశ్రయం ఏర్పాటు చేయాలన్నారు. గతంలోనే ఇక్కడ ఇంధనం నింపుకునేందుకు యుద్ధ విమానాలు సైతం దిగేవని స్థానికులు చెబుతున్నారన్నారు. ఈ విమానాశ్రయం ప్రారంభమైతే పరిశ్రమల ఏర్పాటు, ఉపాధికి అవకాశాలు పెరుగుతాయన్నారు. జిల్లా కేంద్రంలో విమానాశ్రయం, ఆర్మూర్ రైల్వేలైన్, సీసీఐ పునరుద్ధరణ, పత్తి ఆధారిత పరిశ్రమ ఏర్పాటు చేయాలని, ఉట్నూర్ కేంద్రంగా గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని, అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానించింది. దీనికిగాను ఆదిలాబాద్ అభివృద్ధి సాధన పోరాట కమిటీని ఏర్పాటు చేశారు. తాత్కాలిక కో ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్‌గా విజ్జగిరి నారాయణను ఎన్నుకున్నారు. నేడు రైల్వే సాధన కమిటీ ఇచ్చిన బంద్‌కు మద్దతు తెలుపుతూ రైల్వే సాధన కమిటీ ఆదిలాబాద్ అభివృద్ధి సాధన పోరాట కమిటీలో విలీనం కావాలని సూత్రపాయంగా అంగీకారం జరిగింది.

ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లంక రాఘవులు, పూసం సచిన్, సీపీఐ జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడి, బీఆర్ఎస్ నాయకులు వి.నారాయణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ అల్లూరి సంజీవరెడ్డి, సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ నాయకులు నంది రామయ్య, టీఎన్‌జీఓ నాయకుడు సంద అశోక్, వివిధ ప్రజా, ఉద్యోగ, కార్మిక సంఘాల నాయకులు బొజ్జ ఆశన్న, లోకారి పోశెట్టి, రూపేష్‌రెడ్డి, కొండ రమేష్, అంబకంటి అశోక్, బి.రాహుల్, జగన్‌సింగ్, మనోజ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకుడు వి.నారాయణ, పాల్గొన్న వివిధ పార్టీ, ప్రజా సంఘాల నాయకులు

ఉచిత 'వెలుగు' కోసం..!

- జిల్లాలో గృహజ్యోతికి భారీగా దరఖాస్తులు
- 200యూనిట్ల లోపు అనేక మంది అర్హులు
- ప్రభుత్వం అమలు చేయడంపై నిరుపేదల్లో ఆతృత

ప్రభుత్వం అందించనున్న ఉచిత విద్యుత్తు కోసం అనేక మంది అర్హులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అధికారంలోకి వస్తే గృహజ్యోతి పథకం కింద గృహ అవసరాలకు 200యూనిట్లలోపు ఉచితంగా విద్యుత్ సౌకర్యం అందిస్తామని కాంగ్రెస్ హామీనిచ్చింది. ఈ హామీని నమ్మిన జనం హస్తానికి అధికారాన్ని కట్టబెట్టారు. దీంతో ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ఈ హామీని త్వరగా అమలు చేయాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. రానున్న గణతంత్ర దినోత్సవం రోజున ఈ హామీని అమలు చేసేందుకు ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం. కానీ అధికారవర్గాలు మాత్రం ఈ విషయంపై ఇంకా స్పష్టత లేదని చెబుతుండటం గమనార్హం. మరోపక్క ఈ పథకం కోసం ఆదిలాబాద్ జిల్లాలో దరఖాస్తులు చేసుకున్న అనేక మంది అర్హులుగా పరిగణించే అవకాశం కనిపిస్తోంది. ఇన్నాండ్లు విద్యుత్ ఛార్జీల భారంతో సతమతమవుతున్న పేదలకు ప్రభుత్వ నిర్ణయం ఉపశమనం కలిగించనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



ప్రజాపాలనలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్‌రాజ్(ఫైల్)

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ప్రభుత్వం ఆరు గ్యారెంటీల్లో గృహజ్యోతి పథకం ఒకటి. ఈ పథకం కింద అర్హులైన ప్రతి ఒక్కరికి 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్తును కల్పిస్తామని భరోసా కల్పించింది. అధికారంలోకి రాగానే ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణంతో పాటు రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద రూ.10లక్షల బీమా సౌకర్యం కల్పించింది. మిగితా ఐదు గ్యారెంటీల అమలు కోసం వారం రోజుల పాటు దరఖాస్తులు స్వీకరించింది. గ్రామాలు, పట్టణాల వారీగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేసి ప్రజల నుంచి అధికారులు వినతులు తీసుకున్నారు. అన్ని పథకాలకు దరఖాస్తులు వెల్లువెత్తిన మాదిరిగానే గృహజ్యోతికి అదే స్థాయిలో వచ్చాయి. ఆదిలాబాద్ జిల్లాలో 2.04లక్షల కుటుంబాలు విద్యుత్‌ను వినియోగించగా.. ఇందులో 1.68లక్షల కుటుంబాలు 200యూనిట్ల లోపు వినియోగించే వారు ఉన్నారు. జిల్లాలో గృహజ్యోతి పథకం కింద 161366 కుటుంబాలు ఉచిత విద్యుత్తు అందించాలని దరఖాస్తులు అందించాయి. ప్రస్తుతం వినియోగిస్తున్న వారి సంఖ్యను పరిగణనలోకి తీసుకుంటే దరఖాస్తులు చేసుకున్న వారిలో అనేక మంది అర్హులవుతారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

విద్యుత్ బిల్లులతో సతమతం..!

ప్రస్తుతం ప్రజలు విద్యుత్ బిల్లులు చెల్లించలేక తీవ్రంగా సతమతమవుతున్నారు. పేదలకు సైతం నెలకు రూ.వేలల్లో బిల్లులు వస్తుండటంతో రోజూవారీ కూలీ పనులు చేసుకొని జీవించే పేదలు వాటిని చెల్లించలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలో ప్రస్తుతం 0-50యూనిట్లలోపు 85,208 కుటుంబాలు వినియోగించుకోగా..51- 100లోపు 46,073 కుటుంబాలు, 101-150యూనిట్ల లోపు 24,800కుటుంబాలు, 151-200యూనిట్ల లోపు మరో 12,121 కుటుంబాలు వినియోగించుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు. గత ప్రభుత్వం యూనిట్ ఛార్జీలు పెంచడంతో మరింత భారం పడింది. దీంతో చిరుద్యోగులకు ప్రతి నెలా వచ్చే అరకొర వేతనంలో నుంచి విద్యుత్ ఛార్జీలు చెల్లించలేని పరిస్థితి తలెత్తుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత విద్యుత్ హామీనివ్వటంతో ప్రజలు ఆ పార్టీకి పట్టం కట్టారు. ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు గడిచిపోతుండటంతో ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలుపైనే అందరి దృష్టి కేంద్రీకృతమవుతోంది. అధికారంలోకి వచ్చిన వందరోజుల్లోపు ఐదు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పడంతో ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే రెండు అమలు కావడంతో మిగితా వాటిని కూడా అమలు చేస్తుందని నమ్మకంతో ఉన్నారు. అతి త్వరలోనే గృహజ్యోతి పథకంతో పాటు రూ.500లకే గ్యాస్ సిలిండర్ పథకాలను కూడా అమల్లోకి తీసుకొచ్చే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. ఇదే జరిగితే అనేక మంది నిరుపేదలకు ఆర్థిక భారం తప్పేందుకు అవకాశం ఉటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలి

- పథకాలు ప్రజలకు అందాలి
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధికారుల సమీక్షా సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క

నవతెలంగాణ-ఉట్నూర్

జిల్లా అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. మంగళవారం కేబీ కాంప్లెక్స్‌లోని సమావేశ మందిరంలో ఎమ్మెల్యేలు, ఉమ్మడి జిల్లా కలెక్టర్లతో కలిసి ఉమ్మడి జిల్లా అధికారుల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఆదిలాబాద్ వెనుకబడిన, అటవీ జిల్లా అని గుర్తు చేస్తూ పది నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, వివిధ శాఖల అధికారులకు కొన్ని సూచనలు చేశారు. జిల్లాలోని తండా, గూడేల్లో అంగన్వాడీ కేంద్రాలు అభివృద్ధి చెందడం లేదని, అధికారులు నిఘా పెట్టి అభివృద్ధి జరిగేలా చూడాలని తెలిపారు. పేదరికంతో ప్రజలు హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వలస పోతున్నారని, దీన్ని దృష్టిలో పెట్టుకొని అధికారులు పని చేయాలని పేర్కొన్నారు. మనసు పెట్టి పని చేస్తే తప్ప తండాలు, గూడేలు అభివృద్ధి చెందవన్నారు. ప్రతి ఒక్క సమస్యను తీర్చే విధంగా ఉండాలని, పెండింగ్ పనులను, బిల్లులను నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు పరిష్కరించే విధంగా చూడాలని తెలిపారు. ప్రజలను అభివృద్ధి చేయాలి తప్ప రాజకీయం చేయకూడదన్నారు. రాజ్యాంగం ద్వారా రాజకీయ పదవులు, ఉద్యోగాలు పొందామని, కుమురం భీం, అంబేద్కర్ స్ఫూర్తితో ముందుకు సాగాలని పేర్కొన్నారు. అధికారులు గిరిజన విద్యార్థుల విద్యపై దృష్టి పెట్టి జిల్లాకు మొదటి స్థానం వచ్చేలా చూడాలన్నారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి సహకరించాలని, నిర్మాణం జరిగితే తెలంగాణలో రెండో ఎయిర్‌పోర్ట్ అవుతుందని తెలిపారు. ఆదిలాబాద్‌లో వాణిజ్య అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రూ.150కోట్లతో మహా నగరాలకు ధీటుగా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ఆదిలాబాద్‌లో నిర్మించిందని, కానీ ఆసుపత్రిలో 90శాతం మంది డాక్టర్ల నియామకం కాలేదని, కావాల్సిన డాక్టర్లను, టెక్నీషన్‌లను నియమించాలని పేర్కొన్నారు. చనాక-కోర్ట బ్యారేజీ పనులు పూర్తి చేసి రైతాంగానికి సాగు నీరందించాలన్నారు. ఎమ్మెల్యే వెద్మ బొజ్జు మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజలకు ఇచిన హామీలు నెరవేర్చే బాధ్యత తమపై ఉందని, అధికారులు ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని పరిష్కరించే విధంగా చూడాలని కోరారు. ముఖ్యంగా గ్రామాల్లోకి అంబులెన్స్‌లు వెళ్లేలా చూడాలని, విద్య, వైద్యం, తాగు నీరు, విద్యుత్ లాంటి సమస్యలు వెంటనే పరిష్కరించే విధంగా చూడాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. మిగతా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ తమ తమ నియోజకవర్గాల్లోని సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు ప్రజలకు అందేలా అధికారులు చూడాలని కోరారు. అప్పుడే ప్రజలకు ప్రజాప్రతినిధులపై నమ్మకం కల్గుతుందన్నారు. సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, గడ్డం వినోద్, కోవ లక్ష్మి, హరీష్‌బాబు, ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, ఆసిఫాబాద్ కలెక్టర్లు రాహుల్ రాజ్, ఆశిష్ సంగ్వాన్, బదావత్ సంతోష్, బోర్కడే హేమంత్, ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా, వివిధ శాఖలకు చెందిన ఉమ్మడి జిల్లా అధికారులు పాల్గొన్నారు.



అసంక్రమిత వ్యాధులకు పరీక్షలు చేసుకోవాలి

నవతెలంగాణ-నార్నూర్



అసంక్రమిత వ్యాధులపై గ్రామాల్లో ప్రజలు వైద్య సిబ్బంది ద్వారా పరీక్షలు నిర్వహించుకోవాలని పీహెచ్‌సీ వైద్యులు రాంబాబు అన్నారు. మంగళవారం మండలంలోని గంగాపూర్, ఖంపూర్ గ్రామాల్లో వైద్య సిబ్బంది ద్వారా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అసంక్రమిత వ్యాధుల పరీక్షలు నిర్వహించారు. 30ఏండ్లపై బడిన వారికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో హెల్త్ సూపర్‌వైజర్‌లు చౌహన్ చరణ్‌దాస్, సతవ్వ వైద్య సిబ్బంది హిమబిందు, సుశీల, సింధు, విద్యారాణి, కైలాస్ ఆశాలు సునీత, రంభబాయి ఉన్నారు.

అనారోగ్యంతో ఆదివాసీ బాలుడి మృతి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



మండలంలోని హీరాపూర్ పంచాయతీ పరిధిలోని మారుతీగూడకు చెందిన ఆదివాసీ బాలుడు మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గోడం పరమేశ్వర్, రత్నబాయి దంపతుల కుమారుడు రాందాస్(1) గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతుండేవాడు. రిమ్స్‌లో వైద్యం చేయించుకున్నప్పటికీ, ఆరోగ్యం మెరుగు పడక క్షీణించి మంగళవారం తుది శ్వాస విడిచాడు. దీంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

జాతీయ పక్షులకు ప్రాణం పోసిన పశు కాపరులు



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని ముత్నూర్ అటవీ ప్రాంతంలో పశువుల మేతకు వెళ్లిన కాపరులు రెండు జాతీయ పక్షులకు (నెమళ్లకు) ప్రాణం పోసిన సంఘటన చోటు చేసుకుంది. ప్రతి రోజు మాదిరిగా గ్రామ సమీపంలో ఉన్న గుట్ట వద్దకు పశువులను మేపు తుండగా రెండు నెమళ్ల ప్రాణాపాయ స్థితిలో విలవిల లాడుతున్నాయి. ఇది గమనించిన పశు కాపరులు తన మిత్రుడైన దుర్వా రమణకు సమాచారం అందించారు. ఆయన ఈ విషయాన్ని ఎఫ్ఆర్ఓ సంతోష్‌కు సమాచారం అందించగా ఆయన అటవీ బీట్ అధికారినులు రాథోడ్ జ్యోతి, దుర్వ రజనీలకు అటవీ ప్రాంతానికి పంపించారు. అక్కడ రెండు నేమళ్లను గాయపడి ప్రాణ రక్షణ కోసం కొట్టు మిట్టాడుతున్న నెమళ్ల కాపరులు వారికి చూపించారు. అటవీ శాఖ సిబ్బంది స్థానిక పశు వైద్య శాలకు తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రానికి తరలించారు. అటవీ సిబ్బందికి సమాచారం అందించిన పశు కాపరులు పలువురు అభినందించారు.

అభివృద్ధి ప్రణాళికపై సమావేశం

నవతెలంగాణ-ఉట్నూర్

సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ మండల పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారీపై సమీక్షా సమావేశాన్ని మంగళవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో బ్లాక్ డెవలప్‌మెంట్ ప్లాన్‌పై సమావేశాన్ని ఏర్పాట్లు చేశారు. ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు అధ్యక్షతన ఈ సమావేశాన్ని నిర్వహించారు. రానున్న 2024-25వ సంవత్సరానికి సంబంధించి అభివృద్ధి ప్రణాళికను రూపొందించారు. ఐటి కార్యక్రమంలో ఎంపీడీఓ తిరుమల, వైస్ ఎంపీపీ బాలాజీ, నాయకులు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఘనంగా బాలికా దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలకేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో మంగళవారం బాలికా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ భాగ్యవతి, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ నవిత ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కిషోర బాలికలు కార్యక్రమాన్ని గురించి అవగాహనా కల్పించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ అధ్యాపక సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది రాజమణి, సునీత, పద్మ ప్రేమల పాల్గొన్నారు.

కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం



నవతెలంగాణ-ఉట్నూర్

నేషనల్ అగ్రికల్చర్ కోఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా ఉట్నూర్ నార్నూర్, గాదిగూడ, మండలాల్లో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. మంగళవారం ఉట్నూర్ ఎఫ్‌పీసీ సీఈఓ కాంబ్లె ప్రజ్ఞశీల్ తెలిపారు. పలు గ్రామాల రైతులకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. సంస్థ, రైతులు నాణ్యత ప్రమాణాలు పాటించడం చేత నాఫెడ్ ద్వారా కొనుగోలు ప్రారంభించారు. దళాలుల చేత రైతులు మోసపోవద్దని నాఫెడ్ ద్వారా రవాణా ఖర్చులు, రైతులకు గోనే సంచులు పంపిణీ జరుగుతుందన్నారు. సమాచారం కొరకు ఉట్నూర్, శ్యాంపూర్, నార్నూర్, గాదిగూడ మండల సమాఖ్యలో సీఈఓని నేరుగా సంప్రదించాలని కోరారు.

రాష్ట్ర మంత్రి సీతక్కకు ఘన సన్మానం



నవతెలంగాణ-నార్నూర్

జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కను మండల కేంద్రంలో స్థానిక సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్‌తో పాటు నాయకులు ఘన స్వాగతం పలికి సన్మానం చేశారు. మండల కేంద్రంలో నివసిస్తున్న వివిధ వర్గాల ప్రజల అభివృద్ధికి పాటు పడాలని కోరారు. ఆదివాసీ, బుద్ధ భూమి, సేవాలాల్ భవన్, మైనారిటీ భవన్, బీసీ భవన్, మాతంగ్ భవన్, మాదిగ భవన్ లకు రూ.50లక్షల చొప్పున మంజూరు చేయాలని, సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన మంత్రి గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఆయన వెంట పీఏసీఎస్ ఇన్‌చార్జ్ చైర్మెన్ సురేష్ ఆడే, ఫ్యాక్స్ డైరెక్టర్ కాంతారావ్ దుర్గే, దళిత రత్న నర్సింగ్ మొరే, నాయకుడు మహేందర్ దుర్గే, కోర్రల మహేందర్, దేవ్‌రావ్ లోఖండే, దత్తరాం, జాకిరుల్లాఖాన్, సత్తార్, గోవింద్, కరీంఖాన్, అహ్మద్, కైలాస్ ఉన్నారు.

నేడు డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో బుధవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డా.అనిత మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాలో టాటా స్ట్రైవ్, టీం లిస్, మెడ్ ప్లస్, ముతూట్ ఫైనాన్స్, శ్రీరామ్ జనరల్ ఇన్సూరెన్స్ ఐదు కంపెనీలు పాల్గొంటున్నాయని పేర్కొన్నారు. 2023లో డిగ్రీ అయిపోయిన విద్యార్థులు ప్రస్తుతం పూర్తి చేసుకుంటున్న విద్యార్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు రెస్యూమ్ ఫోటోలతో కళాశాలలో నేడు 10 గంటలకు నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరుకావాలని, వివరాలకు చైతన్యకృష్ణ 9887262227 సంప్రదించాలని సూచించారు.

రాహుల్ యాత్రను అడ్డుకోవడం సిగ్గుచేటు

- యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సాయిచరణ్ గౌడ్
- అస్సాం ముఖ్యమంత్రి ఫ్లెక్సీ దహనం



అస్సాం ముఖ్యమంత్రి హేమంత బిశ్వ శర్మ ఫ్లెక్సీని దహనం చేస్తున్న యువజన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, ప్రజలు, నిరుద్యోగుల కష్టాలు తెలుసుకునేందుకు మణిపూర్ నుంచి ముంబై వరకు 6వేల కిలోమీటర్ల చొప్పున చేపట్టిన భారత్ జోడో న్యాయ యాత్రను అస్సాం సీఎం హేమంత్ బిశ్వ శర్మ అడ్డుకోవడం సిగ్గుచేటని, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సాయి చరణ్ గౌడ్ అన్నారు. అస్సాం చేరుకున్న రాహుల్ యాత్రను అడ్డుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తూ అధిష్టానం పిలుపుమేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌక్‌లో అస్సాం ముఖ్యమంత్రి హేమంత బిశ్వ శర్మ ఫ్లెక్సీని దహనం చేశారు. అనంతరం సాయి చరణ్ గౌడ్ మాట్లాడుతూ ప్రజల కష్టసుఖాలను తెలుసుకోవడానికి, నిరుద్యోగులకు భరోసా ఇవ్వడానికి ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ యాత్ర చేపట్టారన్నారు. ఈ క్రమంలో అస్సాంకు యాత్ర చేరుకోగా స్థానిక రాష్ట్ర ముఖ్యమంత్రి తన బలగాలతో అడ్డుకోవడమే కాకుండా, దాడికి పాల్పడటం వారి నీచమైన చర్యకు నిదర్శనమని అన్నారు. 2015 వరకు కాంగ్రెస్ పార్టీలోనే అన్ని హోదాల్లో పదవులు అనుభవించి, నేడు అస్సాం రాష్ట్ర ముఖ్యమంత్రి అయ్యారనే గర్వంతో మోడీ భజన చేస్తూ రాహుల్‌ని అడ్డుకోవడం హేయమైన చర్య అని అన్నారు. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించిన రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటికే ప్రజలు, నిరుద్యోగులు కాంగ్రెస్ పార్టీ వైపు ఉన్నారని, వారందరి సహకారంతో, మద్దతుతో కేంద్రంలోనూ అధికారంలోకి రావడం ఖాయమని స్పష్టం చేశారు. అయితే కొన్ని దుష్టశక్తులు కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను జీర్ణించుకోలేక ఇలాంటి భౌతిక దాడులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. రాబోయే రోజుల్లో ఇటువంటి దాడులకు పాల్పడినట్లయితే కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ నాయకులు ఊరుకోరని, ప్రజల మద్దతు కలుపుకొని దుష్టశక్తులను ఎదిరిస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా అస్సాం ముఖ్యమంత్రి హేమంత్ బిశ్వశర్మ ఒక్కసారి గతాన్ని తెలుసుకొని ప్రవర్తించాలని, లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సిన వస్తుందని హితవు పలికారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు భూపెల్లి శ్రీధర్, ఆదిలాబాద్ యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అర్పత్‌ఖాన్, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు షేక్ నాహిద్, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి, మగ్దుం ఖాన్, మావల మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ధర్మపురి చంద్రశేఖర్, మావల మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పరంకుశం వెంకటేష్, మావల మండలం ఓబీసీ సెల్ చైర్మెన్ కొత్తపెల్లి అడెల్లు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు జాకీర్ భాయ్, గోపిడి సవిన్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకులు వేముల నాగ్‌రాజ్ పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతిని ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించాలి

నవతెలంగాణ-ఉట్నూర్



వచ్చే నెల 15న నిర్వహించే సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాల రోజున సెలవు దినంగా ప్రకటించాలని లంబాడి జేఏసీ ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు డాక్టర్ నరేష్ జాదవ్ అన్నారు. మంగళవారం జయంతి కార్యక్రమాన్ని జిల్లాలో నిర్వహించడానికి జిల్లాకు రూ.10లక్షల చొప్పున నిధులు కేటాయించాలని కోరారు. ఐటీడీఏలో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాక్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని అన్నారు. జీఓ నెంబర్ 3ను పునరుద్ధరించాలని సమావేశాన్ని ఏర్పాటు చేసి అనంతరం మంత్రి ధనసరి అనుసూయకు వినతిపత్రాన్ని అందజేశారు. అదేవిధంగా ఉట్నూర్‌లోనే శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ భవనం కోసం స్థలం కేటాయిస్తూ, భవన నిర్మాణం కోసం రూ.20కోట్ల మంజూరు చేయాలని అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో 317 జీఓను రద్దు చేయాలని, గిరిజన చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించి, గిరిజనుల హక్కులను కాపాడతానని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో జిల్లా ప్రధాన కార్యదర్శిలు బానోతు రామారావు, బానోతు జగన్, ఉపాధ్యక్షులు రాథోడ్ శేషారావు, నేతావత్ రాందాస్ నాయక్, రాజేష్ నాయక్, రాథోడ్ బాబూలాల్, జేపీ నాయక్, సలహాదారులు జాదవ్ గోపాల్ రావు, జాదవ్ రామకృష్ణ నాయక్, కార్యదర్శులు రాథోడ్ మహేందర్, రాథోడ్ వసంతరావు, పవర్ విజయ్, పవర్ రాజేశ్వర్ పాల్గొన్నారు.

ఆస్పత్రిని సందర్శించిన ట్రైనీ కలెక్టర్



పీహెచ్‌సీలోని రికార్డులను పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ వికాస్ మహతో, వైద్య సిబ్బంది

నవతెలంగాణ-తలమడుగు

మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ట్రైనీ కలెక్టర్ వికాస్ మహతో సందర్శించారు. ఆస్పత్రి పరిసర ప్రాంతాలను పర్యవేక్షించారు. అనంతరం డాక్టర్ హరీష్‌తో మాట్లాడుతూ ప్రతిరోజు ఎంత మంది రోగులు వైద్యం చేసుకొనేందుకు వస్తారని అడిగి తెలుసుకున్నారు. ఏ రకమైన రోగులు వైద్యం నిమిత్తం వస్తున్నారని వారికి ఏ విధమైన మందులు అందిస్తారని డాక్టర్ హరీష్‌ని అడిగి తెలుసుకున్నారు. రోగులకు సరిపోయే మందులు అందుబాటులో ఉన్నాయా మందులు లేని పక్షంలో ప్రయివేట్ మందుల ఏమైనా రాస్తుంటారని ఆరాతీశారు. ఆస్పత్రిలో సరిపడు సిబ్బంది పనిచేస్తున్నారా అని వకాబు చేశారు. ప్రాణాపాయ స్థితిలో వచ్చిన రోగులను ఏ ఆస్పత్రులకు పంపిస్తారని తెలుసుకున్నారు. అనంతరం రోగుల పట్టికను పరిశీలించారు. సకాలంలో విధులకు చేరుకొని మెరుగైన వైద్యం అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ట్రైనీ కలెక్టర్ వెంట డాక్టర్ హరీష్, ఆయుష్ డాక్టర్ శ్రీకాంత్, వైద్య సిబ్బంది సంగీత, సత్యశీల శైలజ, నిర్మల హరిదాస్ పలువురు వైద్య సిబ్బంది ఉన్నారు.

డిగ్రీ అడ్మిషన్ల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఆదిలాబాద్ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల 2024-25 విద్యా సంవత్సరానికి ప్రవేశాల ప్రచారానికి సంభందించిన వాల్‌పోస్టర్లను ఎమ్మెల్యే పాయల శంకర్ ఆవిష్కరించారు. మంగళవారం ఆయన నివాసంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, సిబ్బందితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రయివేటుతో పోటీ పడి, ప్రచార కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. గత సంవత్సరం కేవలం సైన్స్ విభాగంలోనే 450 ప్రవేశాలు పొందడం గొప్ప విషయమని అన్నారు. ఈ సంవత్సరం 500 ప్రవేశాలు దాటేలా సహకరిస్తానన్నారు. చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించి, విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జాకీర్ హుస్సేన్, అధ్యాపకులు రఘునాథ్, ప్రతాప్ సింగ్, సంతోష్ కుమార్, రమేష్‌రెడ్డి, సాయిప్రసాద్, జ్యోత్స్న, అనిత, నర్సింగరావు, విజయకుమార్, తిరుపతి, అష్రాఫ్ అలీ, రాజ్ కుమార్, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

నూతన విద్యావిధానం రద్దుకు సంతకాల సేకరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



నూతన జాతీయ విద్యా విధానం రద్దు కోసం విద్యార్థులు ఉద్యమించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి గెడం కేశవ్ పిలుపునిచ్చారు. మంగళవారం ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో వివిధ కళాశాలలో విద్యార్థుల వద్ద నుంచి సంతకాల సేకరణ నిర్వహించారు. విద్యార్థులు పాల్గొని సంతకాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి గేడం కేశవ్ మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్నం భోజనం అమలు చేయాలని నూతన జాతీయ విద్యా విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ యూనివర్సిటీలలో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. యూనివర్సిటీలలో విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలన్నారు. యూనివర్సిటీలకు అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు మెస్రం ప్రవీణ్, గేడం మానిక్, కార్తిక్, ఆర్తి, సుశీల పాల్గొన్నారు.

ముగిసిన పంచాయతీ కార్యదర్శి విచారణ



నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని పొట్టపెల్లి(కె) గ్రామంలో సోమవారం అదనపు కలెక్టర్ ఫైజన్ అహ్మద్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీలత ఆదేశాల మేరకు ఎంపీఓ నసీరుద్దీన్ పంచాయతీ కార్యదర్శి క్రమబద్దీకరణలో భాగంగా తనిఖీ, విచారణ నిర్వహించారు. రిజిస్టర్లు తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామస్తులతో పంచాయతీ కార్యదర్శి పని తీరు పట్ల ఆరా తీశారు. గత వారంలో గ్రామానికి చెందిన కొంతమంది యువకులు ఫిర్యాదు చేయడంతో విచారణ నిర్వహించినట్టు ఎంపీఓ తెలిపారు. గ్రామస్తులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ కార్యదర్శి పనితీరు పట్ల గ్రామస్తులు, యువకులు సంతృప్తి వ్యక్తం చేస్తూ ఎంపీఓకు తీర్మాన పత్రం అందజేశారు. గ్రామాభివృద్ధి కొరకు అందరు కలిసి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉల్వాజీ హైమావతి రాజు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, వార్డు సభ్యులు అశోక్, చిన్నారెడ్డి, ఎఫ్ఏ శ్రీనివాస్, గ్రామస్తులు రాజు కుమార్, నర్సయ్య, సాయన్న, రవీందర్, నితీష్, విజయ్, గ్రామస్తులు ఉన్నారు.

సదర్‌మాట్ రైతులను ఆదుకుంటాం : మంత్రి సీతక్క



నవతెలంగాణ-కడెం

సదర్‌మాట్ రైతులను ఆదుకుంటామని మంత్రి సీతక్క అన్నారు. మంగళవారం మండలానికి చెందిన లింగాపూర్, సారంగాపూర్, మాసాయిపేట, కొత్త మద్దిపడగ, పాతమద్దిపడగ, లక్ష్మీసాగర్, పెద్దూర్, పెత్తర్పు గ్రామాల సదర్‌మాట్ ఆయకట్టు రైతులు ఉట్నూర్‌లోని కుమురంభీం కాంప్లెక్‌లో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క)ని సదర్‌మాట్ రైతులకు 2వ పంటకు నీరందేలా చూడాలని, సదర్‌మాట్ రైతాంగ సమస్యలు పరిష్కరించాలని మంత్రికి విన్నవించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సదర్‌మాట్ రైతుల సమస్యలు తమ దృష్టిలో ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కడం మండల కాంగ్రెస్ నాయకులు, ఇందూర్ నేత, జడ, రాజేష్ నేత, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

అడ్మిషన్ల కొరకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ అల్పసంఖ్యాక వర్గాల గురుకుల విద్యాలయాల సంస్థ (టీఎంఆర్ఈఐఎస్)లో 2024-25 విద్యా సంవత్సరానికి గాను అడ్మిషన్ల కొరకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మొదలైనట్లు మైనార్టీ గురుకుల పాఠశాల చాందా(టి) ప్రిన్సిపల్ జాడి తిరుపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో ప్రవేశానికి ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని ఆయన తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ ఫిబ్రవరి 6వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. అర్హులైన విద్యార్థులు అడ్మిషన్ కొరకు అప్లై చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు టీఎంఆర్ఈఐఎస్‌తెలంగాణ.సీజీజీ.గావ్.ఇన్ గాని 7995057871 నెంబర్‌ను గాని సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని డాక్టర్ సర్వరాజ్ అన్నారు. మంగళవారం మండలంలోని చిచ్‌ధరి, ఖానాపూర్, సబ్ సెంటర్ పరిధిలోని తిప్ప గ్రామపంచాయతీలోని కొలామ్‌గూడ కాలనిలో జన్‌మన్, సికిల్‌సెల్ పరీక్షలు నిర్వహించారు. ఇమ్యూనైజెషన్ చేశామని పేర్కొన్నారు. ఇతర వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యావేక్షకులు సుభాష్, ఆరోగ్య కార్యకర్తలు మడావి సత్యవతి, పవర్ శైలజ, రాథోడ్ నారాయణ, పవర్ ప్రేమ్ సింగ్, ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ సంచార వైద్య వాహనంలోని సిబ్బంది సుష్మ, ల్యాబ్ టెక్నిషియన్ భీంరావు, ఆరోగ్యమిత్రలు విమల, లక్ష్మీ పాల్గొన్నారు.

పాఠశాలస్థాయి విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

నవతెలంగాణ-ఉట్నూర్

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని బోలిచేతో ఫౌండేష్, ఉట్నూరు సాహితీ వేదిక ఆధ్వర్యంలో పాఠశాలస్థాయి విద్యార్థులకు వ్యాస రచన పోటీలు 24న మండలంలోని దంతన్‌పల్లి జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో నిర్వహిస్తున్నట్టు మంగళవారం అధ్యక్షులు జాదవ్ బంకట్ లాల్, ప్రచార కార్యదర్శి ఆత్రం మోతీరాం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కింది అంశాలపై వ్యాస రచనలు రాయాలని సూచించారు. ఆదిలాబాద్ జిల్లా ఆదివాసుల ఆహార అలవాట్లు, ఆధునిక యుగం, ఆదివాసుల భాషలు, ఆదివాసీ భాష సంస్కృతి పరిరక్షణ, అంతర్జాలంలో ఆదివాసీ భాషలు పరిరక్షణ యువత పాత్రలపై వ్యాస రచన ఉంటుందని తెలిపారు. విద్యార్థులు ప్రతి అంశానికి ప్రథమ బహుమతి ఉంటుందని తెలిపారు. ఉట్నూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులందరూ పోటీకి అర్హులని, సంప్రదించాల్సిన నెంబర్, 9398020367, 7981252233.

గిరిజన పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారం అందేలా చూడాలి

నవతెలంగాణ-నార్నూర్

గిరిజన పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రంలో నాణ్యమైన పౌష్టికాహారం అందే విధంగా చూడాలని తుడుందెబ్బ డివిజన్ అధ్యక్షుడు కనక ప్రభాకర్ సీడీపీఓను కోరారు. మంగళవారం మండలంలోని కొత్తపెల్లి కొలాంగూడను ఎంపీడీఓ రమేష్, సీడీపీఓ శరత్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు సరైన ఎదుగుదల లేక బాధపడుతున్నారని పేర్కొన్నారు. పిల్లల తల్లిదండ్రులు, గ్రామస్తులతో మాట్లాడి చిన్నారులకు సరైన పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఎదుగుదలతో బాధపడుతున్న పిల్లలకు ఎస్ఆర్సీ ఉట్నూర్‌కు పంపిస్తామని సీడీపీఓ పేర్కొన్నారు. వారి వెంట భీంపూర్ ఎంపీటీసీ రేణుక దిలీప్, అంగన్‌వాడీ శీల ఉన్నారు.

మంత్రి సీతక్కను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-కెరమెరి



మండలంలోని తెలంగాణ మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన మహారాజ్ గూడ సమీపంలో వెలసిన ఆదివాసుల ఆరాధ్య దైవం జంగూబాయి పుణ్యక్షేత్రాన్ని సందర్శించిన పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కను మర్యాదపూర్వకంగా కలిశారు. మొదటిసారి మండలానికి రావడంతో కాంగ్రెస్ నాయకులు మంత్రిని శాలువాతో ఘనంగా సన్మానించి, అభినందించారు. మంత్రిని సన్మానం చేసిన వారిలో కాంగ్రెస్ నాయకులు శంషోద్దీన్, సాగర్ సాజిద్, సాగర్, రావూఫ్ పాల్గొన్నారు.

కారుణ్య నియామకానికి ఇంటర్వ్యూలు

నవతెలంగాణ-రెబ్బెన



సింగరేణి ఉద్యోగం చేస్తూ మృతిచెందిన, మెడికల్ ఇన్వాలిడేట్ అయిన ఉద్యోగుల వారసులకు బెల్లంపల్లి ఏరియాలోని గోలేటిలోని జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూలకు హాజరైన అభ్యర్థులు కుటుంబసభ్యులను పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి సమక్షంలో ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. అనంతరం సింగరేణి సంస్థ అందే బెనిఫిట్స్ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీవైపీఎం నాగుల వేణు, జూనియర్ అసిస్టెంట్ బాబా, సరిత పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు గిరిజన క్రీడా పాఠశాల విద్యార్థులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



దేశ రాజధాని ఢిల్లీలో జరగబోయే గణతంత్ర వేడుకల్లో ఆసిఫాబాద్ లోని గిరిజన క్రీడ పాఠశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. గిరిజన క్రీడల అధికారి బండమీనారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.కృష్టారావులు వివరాలు తెలుపుతూ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఆత్రం అంజలి, (అథ్లెటిక్స్) తుంరం సత్యభామ (హ్యాండ్ బాల్)లాకు గణతంత్ర వేడుకల్లో పాల్గొనడానికి ప్రత్యేక ఆహ్వానం లభించిందని తెలిపారు. క్రీడల్లో అత్యంత ప్రతిభ కనబరిచినందుకు వీరికి ఆహ్వానం అందిందని వారు తెలిపారు. విద్యార్థినులను ఐటీడీఏ ప్రాజెక్ట్అధికారిని ఖుష్బు గుప్తా, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకురాలు ఆర్.రమాదేవి, ఏసీఎంఓ ఉద్దవ్, ఏటీడీఓలు క్షేత్రయ్య, కమర్ హుస్సేన్, పురుషోత్తం, జీసీడీఓ శకుంతల, క్రీడ పాఠశాల శిక్షకులు విద్యాసాగర్, అరవింద్, తిరుమల్ అభినందించారు.



విద్యార్థులకు వైద్య పరీక్షలు

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి నేహ తస్లీమా ఆధ్వర్యంలో విద్యార్థినిలకు రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలలో ఉన్న విద్యార్థులందరి రక్త నమూనాలు సేకరించి ఆరోగ్య స్థితిని తెలుసుకోవడానికి ఈ పరీక్షలు ఉపయోగపడుతాయని, ప్రతి ఒక విద్యార్థికి రక్త పరీక్షలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంగాసింగ్, ఆర్‌బీఎస్‌కె సిబ్బంది, హెచ్‌వి విక్టోరియా, ల్యాబ్ టెక్నీషియన్ నాగరాజు, శ్రీలత, హెల్త్ అసిస్టెంట్ ధర్మారావు, ఏఎన్ఎం భాగ్యలక్ష్మి, కస్తూర్బా ప్రత్యేక అధికారిని శారద, ఏఎన్ఎం శ్రీవెన్నెల పాల్గొన్నారు.

సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కేజీబీవీలో బాలికలకు అందిస్తున్న మౌలిక వసతులను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ అన్నారు. ఈసీఐఎల్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కేజీబీవీలో ఏర్పాటుచేసిన వెండింగ్ మిషన్, ఇన్సినారేటర్లను కంపెనీ ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలోని 15 కస్తూరిబా బాలికల విద్యాలయాలలో వెండింగ్ మిషన్లు, ఇన్సినారేటర్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దీనికి ఈసీఐఎల్ వారు అందిస్తున్న సహకారం ఎన్నటికీ మర్చిపోలేనిదన్నారు. విద్యార్థులకు కనీస వసతులను కల్పించినప్పుడు వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకున్నప్పుడు మాత్రమే విద్యార్థినులు చదువులో రాణిస్తారని అన్నారు. విద్యార్థినులకు అందిస్తున్న సౌకర్యాలను వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం కేజీబీవీ విద్యార్థినులకు శానిటరీ నాప్కిన్స్‌ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈసీఐఎల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ రమేష్, దుర్గాప్రసాద్, చౌహాన్లు, సమగ్ర శిక్ష జెండర్ కోఆర్డినేటర్ రాథోడ్ సుభాష్, ప్లానింగ్ కోఆర్డినేటర్ భరత్, ప్రత్యేక అధికారిని నలంద విద్యార్థినిలు పాల్గొన్నారు.

అయోధ్యకు సైకిల్‌పై పీవీటీజీ యువకుడు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని తిర్యాని మండలం ఏదులపాడు గ్రామానికి చెందిన పీవీటీజీ యువకుడు ఆత్రం ప్రభాకర్ కుమారుడు సచిన్ 22న అయోధ్యకు సైకిల్‌పై గ్రామం నుంచి బయలుదేరగా మంగళవారం జిల్లా కేంద్రానికి చేరుకున్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయోధ్య ఆలయ ప్రారంభం తర్వాత సైకిల్ యాత్ర చేయాలని నిర్ణయం తీసుకున్నానని, దీనిలో భాగంగానే అయోధ్యకు బయలుదేరినట్లు తెలిపారు. యాత్రకు అనేకమంది సహకారం అందిస్తున్నారని వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు గ్రామస్తులు ఆయనకు మంగళ హారతులు ఇచ్చి వీడ్కోలు పలికారు.

ఆదివాసుల సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడాలి

- జంగుబాయి క్షేత్రాన్ని సందర్శించి మంత్రి సీతక్క
- డోలు వాయిద్యాలతో మంత్రికి ఘనస్వాగతం



నవతెలంగాణ-కెరమెరి

పవిత్రమైన ఆదివాసి సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్తు తరాలకు అందించేందుకు అందరూ సమిష్టిగా కాపాడుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులోని మహరాజ్ గూడ సమీపంలోని దట్టమైన అడవుల్లో వెలసిన జంగుబాయి పుణ్యక్షేత్రాన్ని మంగళవారం కలెక్టర్ బొర్కాడే హేమంత్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో కలిసి ఆమె దర్శించుకున్నారు. పుణ్యక్షేత్రంలో ఈనెల 14 నుంచి 25వ తేదీ వరకు నిర్వహిస్తున్న మహపూజ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివాసుల ఆరాధ్య దైవం జంగుబాయిని దర్శించుకోవడానికి హాజరైన రాష్ట్రమంత్రికి ఆదివాసీలు సాంప్రదాయ పద్ధతులలో డప్పు వాయిద్యాలతో స్వాగతం పలికారు. నంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. జంగుబాయి దేవత పుణ్యక్షేత్రం చాలా పవిత్రమైనదని, ఆదివాసుల ఆరాధ్య దైవమని పేర్కొన్నారు. ఆదివాసుల సంస్కృతి, సాంప్రదాయాలను ప్రభుత్వం గౌరవిస్తుందని, వీటిని కాపాడి భవిష్యత్తు తరాలకు అందించేందుకు అందరం సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.



అన్ని సౌకర్యాలు కల్పిస్తాం

జంగుబాయి క్షేత్రానికి తాగునీటి సౌకర్యం, ఆలయానికి చేరుకునేందుకు సౌకర్యవంతమైన రోడ్డు నిర్మాణం చేపడుతామన్నారు. జంగు బాయిని దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వస్తున్నందున పూర్తిస్థాయి వసతులు కల్పించేందుకు అవసరమైన నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. ఉమ్రి నుండి పుణ్యక్షేత్రం వరకు రోడ్డు నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. జంగు భాయి దేవత అడవిలో వెలిసిందని, ఈ అడవిని రక్షించుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని చెప్పారు. అడవిలోని వన్యప్రాణులకు ఎలాంటి హాని కలిగించకూడదని సూచించారు. సహజ వనరులు ఉన్నటువంటి ఈ ప్రాంతాన్ని కాపాడుకోవాలని సూచించారు. అనంతరం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడుతూ ఆదివాసుల ఆరాధ్య దైవమైన జంగుబాయి చీకటి గుహలో దూప దీపాలతో వెలుగొందుతున్న దేవతఅని తెలిపారు. ఈ ప్రాంత విశిష్టత తెలుసుకొని జంగు బాయి దేవతను దర్శించుకోవడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. అటవీ, విద్యుత్, ఇండ్ల సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఎంపీపీ పెందూర్ మోతీరాం, జడ్పీటీసీ సెడ్మకి ద్రుపత బాయి, ఎంపీడీఓ మహేందర్, తహసీల్దార్ షరీఫ్, ఆలయ కమిటీ చైర్మన్ మరపబాజీరావు పాల్గొన్నారు.

మంత్రికి మెమోరాండం అందించిన సర్పంచ్

జంగు బాయి పుణ్యక్షేత్రంతో పాటు, శంకర్లొద్దిలోని శైవక్షేత్రం, కపిల దేవత వరకు రోడ్డు సౌకర్యం కల్పించాలని ముఖద్దంగూడ సర్పంచ్ పతాంగే లింబాదాస్ మంత్రికి మెమోరాండం అందించారు. పుణ్యక్షేత్రం పరిసర గ్రామాల రైతులకు త్రిఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పించాలని విన్నవించారు.



మహనీయుడు సుభాష్ చంద్రబోస్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

చరిత్ర పుటల్లో గొప్ప నేతగా మిగిలిపోయిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ మహనీయుడని జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి నేతాజీ సుభాష్ చంద్రబోస్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మొదటగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్ల అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ స్వతంత్ర్య పోరాటంలో అలుపెరుగని పోరాటం చేసి, అమరుడైన సుభాష్ చంద్రబోస్ మనకు ఎంతో ఆదర్శవంతుడు అని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు, ఎంపీపీ అరిగెల మల్లికార్జున్, ఎంపీడీఓ శశికళ, సర్పంచ్ బాబురావు, గుండి మాజీ ఎంపీటీసీ రవీందర్ పాల్గొన్నారు.

బెజ్జూరు : మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ఎంపీటీసీ పర్వీన్ సుల్తానా తెలంగాణ జావిద్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ 127వ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుభాష్ చంద్రబోస్ దేశ స్వాతంత్ర్య పోరాటంలో వీరోచితంగా పోరాడి ఆజాద్ హింద్ సైన్యాన్ని ఏర్పాటుచేసి బ్రిటీషుల పాలిట సింహ స్వప్నంగా మారాడని అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పర్వీన్ సుల్తానా, జెడ్పీఎస్ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి సునీత, ఉపాధ్యాయులతు ఆర్ శ్రీనాథ్, కె శ్రీనివాస్, అబ్దుల్ యాకూబ్, సమ్మయ్య, ఎస్‌కె జమీల్, కపిల్, ఆశాజ్యోతి, సంతోష్, పుణేష్, బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ జావిద్, జి తిరుపతి, ఎం అరుణ్, సూర్ల కళ్యాణ్, గుర్లె అంజన్న పాల్గొన్నారు.

వాంకిడి : మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథకం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ 127వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ బ్రిటీష సామ్రాజ్య వాదాన్ని పూర్తిగా భారతదేశం నుంచి తరిమికొడుతూ భారతదేశ ప్రజానికాన్ని చైతన్య పరిచి, భారతదేశానికి స్వేచ్ఛవాయువు అందించిన గొప్ప వ్యక్తి నేతాజీ అని కొనియాడారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి చంద్రయ్య, కళాశాల అధ్యాపకులు సురేందర్‌కుమార్, సంతోష్, రాజమౌళి, శ్రీధర్, కిరణ్‌కుమార్, తిరుపతి, సత్యం, అశ్విని, సంతోష్, శ్రీకాంత్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

317 జీఓ బాధితులకు న్యాయం చేయాలి

- టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

317 జీఓ బాధితులకు న్యాయం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి కోరారు. ఉమ్మడి అదిలాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా ఉట్నూర్‌కు వచ్చిన రాష్ట్ర మంత్రి ధనసరి సీతక్కకి టీఎస్‌యూటీఎఫ్ జిల్లా శాఖ పక్షాన ప్రధాన కార్యదర్శి ఇందురావుతో కలిసి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 317 జీఓ ద్వారా స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులను వారి స్థానిక జిల్లాలకు పంపించాలని, భార్యా భర్తలిరువురిని ఒక చోటికి చేర్చాలన్నారు. కేజీబీవీ, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల, ఆశ్రమ, సర్వశిక్ష అభియాన్, వివిధ గురుకులాలలో విధులు నిర్వహిస్తున్న గెస్ట్, పార్ట్ టైం, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులందరికీ మినిమం బేసిక్ పే వర్తింపజేయాలని, హెల్త్ కార్డులు మంజూరు చేయాలన్నారు. నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. ప్రమోషన్లు, బదిలీలు చేపట్టే విధంగా ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించాలని, మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఆర్థిక శాఖలో పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల బిల్లులు వెంటనే మంజూరు చేయాలన్నారు. తాము కోరిన డిమాండ్ల పట్ల మంత్రి సానుకూలంగా స్పందించి వివరించారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా నాయకులు జాదవ్ సుభాష్, జుట్టు మహిపాల్, పుల్లూరి బాలకృష్ణ, రాథోడ్ గణేష్, రాథోడ్ మహేందర్ నాయక్ పాల్గొన్నారు.

మట్టి రోడ్డును ప్రారంభించిన జెడ్పీటీసీ

నవతెలంగాణ-రెబ్బెన



మండలంలోని రెబ్బెన గ్రామ పంచాయతీ పరిధిలోని వ్యవసాయదారులకు తమ పంట పొలాలకు వెళ్లడానికి ఎంఎన్ఆర్ ఈజీయస్ పథకం ద్వారా మట్టి రోడ్డును మంగళవారం జెడ్పీటీసీ వేముర్ల సంతోష్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బొమ్మినేని అహల్యాదేవి, ఎంపీటీసీ పెసరు మధునయ్య, ఏపీఓ బుచ్చన్న, పంచాయతీ కార్యదర్శి రవీందర్, ఫీల్డ్ అసిస్టెంట్ తుకారాం, రైతులు పాల్గొన్నారు.

అటవీ, రెవెన్యూ ఆధ్వర్యంలో జాయింట్ సర్వే

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



మండలంలోని ఎల్లూరు గ్రామ శివారులో గల సర్వేనెంబర్ 338, 342, 340, 339లో అటవీ శాఖ, రెవెన్యూ శాఖ జాయింట్ సర్వేను తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సర్వేలో భాగంగా అటవీ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు హద్దులను ఏర్పాటుచేయడానికి సర్వేను చేపట్టారు. ఈ సర్వేలో ఏడీఎస్ఎల్ఆర్ సోమేశ్వర్, ఇన్‌చార్జి రేంజ్ అధికారి సుధాకర్, ఫారెస్టు బీట్ అధికారులు సాగరిక, వంశీ, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ గోపాల్, సర్వేయర్ రామకృష్ణ పాల్గొన్నారు.

పులుల సంరక్షణ మనందరి బాధ్యత

- రైతులను అటవీ అధికారులు వేధించొద్దు
- సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

పులుల సంరక్షణ మనందరి బాధ్యత అని వాటికి హాని తలపెట్టరాదని, అటవీ అధికారులు సైతం పోడు రైతులను వేధించవద్దని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు అన్నారు. మండలంలోని వంజరి రైతువేదికలో మంగళవారం అటవీశాఖ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. పులిదాడిలో మరణించిన పశువుల యజమానులకు చెక్కులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పులులకు క్రిమిసంహారక మందు, విద్యుత్ తీగలు అమర్చి అంతమొందించడం దారుణమని తెలిపారు. రైతులేవరూ ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడొద్దని రైతులకు సూచించారు. పోడు రైతులు దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న అటవీ భూముల విషయంలో అటవీశాఖ అధికారులు ఇబ్బంది పెట్టడం మానుకోవాలని, వారి జీవన భృతి విషయంలో సానుకూలంగా వ్యవహరించాలని అటవీ అధికారులకు సూచించారు. ఉన్న భూమిని వదిలేది లేదని, కొత్త భూమిని కొట్టేది లేదనే నినాదాన్ని గ్రామస్థులు, రైతులు, అటవీశాఖ అధికారులు అమలు చేయాలని సూచించారు. అనంతరం స్కూల్ పిల్లలకు అటవీ శాఖ అధికారుల ఆధ్వర్యంలో బ్యాగులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ ఇన్‌ఛార్జి చైర్మన్ కోనేరు కృష్ణ, జిల్లా అటవీ అధికారి నీరజ్ కుమార్, కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు, ఎంపీడీఓ సత్యనారాయణ, ఎంపీపీ చీపురుశెట్టి శంకరయ్య, డెప్యూటీ ఎఫ్ఆర్ఓ రమాదేవి, రూరల్ ఎస్సై సోనియా, సర్పంచిలు ముంజం రమేష్, సిడాం జంగు, నాయకులు పుల్ల అశోక్ పాల్గొన్నారు.

ఘనంగా నేతాజీ జయంతి



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

కాగజ్‌నగర్ పట్టణంలోని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కార్యాలయంలో అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నేతాజీ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జయంతే కాని వర్ధంతి లేని మహా నాయకుడు, దేశభక్తుడు, ఆజాద్ హిందూ ఫౌజ్ సైన్యాధ్యక్షుడు, ఆంగ్లేయులను గడగడ వణికించిన దేశభక్తుడు నేతాజీ అన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ, యూ.నారాయణ, కలికోట రమణయ్య, వాహబ్, మసూద్ అలీ, టీ.శ్రీనివాస్, షారూఖ్ అలీ, సాయి, పాషా, అజాజ్ పాల్గొన్నారు.

అక్రమ కలప పట్టివేత



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రేంజ్ పరిదిలోని చిర్రకుంట సెక్షన్‌లో సోమవారం రాత్రి అటవీ అధికారులు అక్రమ కలప పట్టుకున్నారు. ఆసిఫాబాద్ రేంజ్ అధికారి అప్పలకొండ తెలిపిన వివరాల ప్రకారం ముందస్తు సమాచారం మేరకు మండలంలోని బాబాపూర్ నుంచి ఆసిఫాబాద్ వస్తున్న టాటా ఏసీ నెంబర్ (ఏపీ22వి 1202) వాహనంలో అక్రమంగా కలప తరలిస్తుండగా సెక్షన్ అధికారి సాయి చరణ్ తన బృందంతో తనిఖీలు నిర్వహించి పట్టుకున్నట్లు తెలిపారు. తనిఖీల్లో 2 కలప దుంగలు పట్టుకున్నారని, వాటి విలువ సుమారు రూ.8733 ఉంటుందని నిందితులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. ఈ తనిఖీల్లో బీటు అధికారి మహేష్ పాల్గొన్నారు.

విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పడాలి



నవతెలంగాణ-రెబ్బెన

మండలకేంద్రంలోని ప్రభుత్వ కళాశాలలో చదువుతున్న విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం అధ్యాపకులు కృషి చేయాలని కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సతీష్ అన్నారు. మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో టీజీజేఎల్ఏ క్యాలెండర్‌ను ఆ సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో ఇంటర్ మీడియట్ అత్యంత ప్రాధాన్యమైందన్నారు. విద్యార్థులు మంచిమార్గాన్ని ఎంచుకునేలా బోధనలు ఉండాలన్నారు. కార్యక్రమంలో టీజీజేఎల్ఏ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నిరియల్‌కార్ శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ ప్రకాష్, మహిళా కార్యదర్శి సంధ్యారాణి, సంఘం సభ్యులు అమరేందర్, మంజుల, వెంకటేష్, వెంకటేశ్వరి, శారద, రామారావు, మల్లీశ్వరి పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
బుధవారం | జనవరి 24, 2024 | www.navatelangana.com

సోమగూడెంలో ఐమాస్ట్ లైట్ల ప్రారంభం



నవతెలంగాణ-కాసిపేట

సోమగూడెం భరత్‌కాలని గ్రామ పంచాయతీ పరిధిలోని ఆయా కాలనీలలో ఐమాస్ట్ లైట్లను సర్పంచ్ ప్రమీలా గౌడ్ ప్రారంభించారు. సోమగూడెంలో డీఎంఎఫ్టీ నిధుల నుంచి ఐమాస్ట్ లైట్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామంలో అభివద్ధి పనులు పూర్తి చేశామని, ప్రధాన కాలనీలలో ఐమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు జాడి ప్రమీలా, చిప్పకుర్తి తిరుపతి, ఉస్కెమల్ల వివేక్, కోప్షన్ సభ్యుడు పిండి సారయ్య పాల్గొన్నారు.

యువతకు నేతాజీ ఆదర్శప్రాయుడు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



యువకులందరికి నేతాజీ ఆదర్శ ప్రాయమని ఆయన చూపిన మార్గంలో యువత నడవాలని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం నేతాజీ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని నేతాజీ చౌక్‌లో విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వాలు భారత చరిత్రను, మహనీయుల వీరగాథలను భావితరాలకు తెలినీయకుండా అసత్య ప్రచారాలను చేసిందన్నారు. ద్రోహులను భారత వ్యతిరేకులు పెంచి పోషించిందన్నారు. నేతాజీ చేసిన సాహసానికి ఆయన ఏర్పాటు చేసిన సైన్యాన్ని ఎదుర్కొనే ధైర్యం లేక బ్రిటిష్ వారు భారత దేశం నుంచి తప్పుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు కార్యకర్తలు ఉన్నారు.

ముక్తా సాల్వే మాంగ్ జయంతిని విజయంతం చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని కాగ్నే ఫంక్షన్ హాల్‌లో మాంగ్ సమాజ్ ఇంద్రవెల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 28న నిర్వహించే ముక్తాబాయి సాల్వే మాంగ్ 183వ జయంతిని విజయవంతం చేయాలని మాంగ్ సమాజ్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు గాదెకర్ పరశురామ్ మాంగ్ కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎలక్ట్రానిక్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, మాంగ్ సమాజ్ రాష్ట్ర అధ్యక్షులు గైక్వాడ్ తులసిదాస్ మాంగ్, మహారాష్ట్ర ప్రముఖ వక్త తోట్వే బాలాజీ మాంగ్ ఇతర ప్రముఖులు హాజరవుతారన్నారు. మాంగ్ సమాజ్ పెద్దలు, మేధావులు, విద్యార్థులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాంగ్ సమాజ్ ఆదిలాబాద్‌టౌన్ కమిటీ కార్యదర్శి సూర్యావంశీ సాయి మాంగ్, మాంగ్ సమాజ్ ఇంద్రవెల్లి మండల ప్రధాన కార్యదర్శి సమూకరావు హరిదాస్ మాంగ్, మండల కమిటీ సలహాదారులు సమూకారావు దీపక్, మాంగ్ ఇచ్చోడ సమాజ్ మండల కమిటీ ఉపాధ్యక్షులు తల్వారే విఠల్ మాంగ్, మండల కమిటీ సభ్యులు కాంబ్లే సాయి మాంగ్, గైక్వాడ్ దినేష్ మాంగ్, కాంబ్లే సాయిరామ్ మాంగ్ పాల్గొన్నారు.

ఎంపీ స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకోవడమే లక్ష్యం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రానున్న ఎన్నికల్లో ఎంపీ స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకోవడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆదివాసీ నాయకురాలు శ్రీలేఖ ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరగా ఆమెకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీ గెలుపుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంతో ఆదివాసీ బిడ్డ బీజేపీలో చేరడం అభినందనీయమని అన్నారు. అంతకుముందు శ్రీలేఖ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. శివాజీ చౌక్, అంబేద్కర్ చౌక్, నేతాజీచౌక్, వినాయక్‌చౌక్‌ల మీదుగా ర్యాలీ కొనసాగగా డోలు, సన్నాయి, వాయిద్యాలు గుస్సాడీ నృత్యాలతో ఆకట్టుకుంది. అనంతరం కుమురంభీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి పాలాభిషేకం చేశారు. జై ఆదివాసీ, జై ఆదివాసీ అంటూ నినదించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆధినాథ్, ఆదివాసీలు కార్యకర్తలు పాల్గొన్నారు.

సొనాలలో ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-బోథ్

నూతనంగా ఏర్పాటైన సొనాల మండలంలో ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని కోరుతూ మంగళవారం నేరడిగొండ మండల నాయకులు జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేశారు.సొనాల మండలం ఏర్పాటు అయి నెలలు గడుస్తున్నప్పటికీ కార్యాలయాలు ఏర్పాటు చేయలేదని కోరారు. స్పందించిన జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి త్వరలోనే సొనాల మండలంలో అన్ని శాఖల నూతన కార్యాలయాలను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సొనాల పట్టణ అధ్యక్షులు చెట్లపెళ్లి అనిల్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ జనరల్ సెక్రటరీ, రమేష్ బత్తుల, సీనియర్ నాయకులు గాజుల పోతన్న, నల్ల అరుణ, విజయ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

రైల్వే లైన్ సాధన కమిటీ దీక్షకు తుడుందెబ్బ మద్దతు

- 8వ రోజుకు చేరిన సాధన కమిటీ దీక్షలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ టూ ఆర్మూర్ రైల్వే లైన్ సాధించే వరకూ తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు గోడం గణేష్ అన్నారు. పట్టణంలోని స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహం వద్ద చేపట్టిన రిలే దీక్షలు మంగళవారం 8వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్ష శిబిరాన్ని తుడుం దెబ్బ ఆధ్వర్యంలో ఆదివాసులు సందర్శించి, తమ సంఘీభావం ప్రకటించారు. ఆదివాసీ సాంప్రదాయ వాయిద్యాలతో తరలివచ్చి మద్దతు తెలియజేశారు. ఆదిలాబాద్ ఆర్మూర్ రైల్వేలైన్ పూర్తయితే ఆదిలాబాద్ వాసుల చిరకాల వాంఛ నెరవేరుతుందని గోడం గణేష్ అన్నారు. రవాణా సౌకర్యం బాగుపడ్డప్పుడే విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. తక్షణమే రైల్వే లైన్ మంజూరు చేసి ఒకే దఫాలో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న ఇబ్బందులను దూరం చేయాలని కోరారు. అప్పటి వరకు ఉద్యమం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ముధోల్ : 33కేవీ సబ్‌స్టేషన్ నెలవారి నిర్వహణ మరమ్మత్తుల పనుల దృష్ట్యా బుధవారం ముధోల్ ఉమ్మడి మండలంలోని ముధోల్, బ్రహ్మణ్‌గావ్, బిద్రెల్లి సబ్‌స్టేషన్ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏడీఏ బి.లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 5 గంటలవరకు మరమ్మతుల నిమిత్తం విద్యుత్ అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

వరిలో మొగి పురుగు నివారణకు చర్యలు

ముధోల్ : మండలంలోని ఆయా గ్రామాల్లోని వరి పంటలలో మొగిపురుగు ఉధృతిని గుర్తించడం జరిగిందని ఏఓ అజ్మీర భాస్కర్ అన్నారు. మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో మంగళవారం వరి పంటలను పరిశీలించారు. అయితే రైతులు వరిలో మొగి పురుగు నివారణకై కార్టప్ హైడ్రోక్లోరైడ్ 400 గ్రాములు ఒక ఎకరానికి మందు పిచికారి చేయాలని లేదా, ఎకరానికి 8కిలోల గుళికలు వేసుకోవాలని పేర్కొన్నారు. రైతులకు సస్య రక్షణ చర్యల గురించి చెప్పేందుకు వ్యవసాయశాఖ ఏఈఓలు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని అన్నారు.

16న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

- ఎస్‌సీకేఎస్(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న దూలం శ్రీనివాస్

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి కాంట్రాక్టు కార్మికుల హక్కులను సాధనకు, సింగరేణి సంస్థలు కాపాడాలన్న ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త సమ్మను కార్మికులంతా జయప్రదం చేయాలని ఎస్‌సీకేఎస్(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం గట్టు మహేందర్ అధ్యక్షతన ఎస్ఆర్పీ ఓసీలో నిర్వహించిన బెల్ట్ క్లీనింగ్ కార్మికుల సమావేశంలో అయన పాల్గొని మాట్లాడారు. మోడీ ప్రభుత్వం కార్మికుల హక్కులపై దాడి చేస్తూ, కార్మికులను కార్పొరేట్ల కట్టు బానిసలుగా, నడిచే యంత్రాలుగా మార్చే కుట్రలకు పునాదులు వేస్తున్నాడని విమర్శించారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేస్తూ, వాటి స్థానంలో నాలుగు లెబర్ కోడ్‌ల పేరుతో కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. అంతే కాకుండా 12 గంటల పని విధానంతో కార్మికున్ని పూర్తిగా యంత్రంలా మార్చే పనిలో నిమగ్నమయ్యాడని ఆరోపించారు. జాతీయ కనీస వేతనం రోజుకు రూ.178 సరిపోతాయంటూ చెప్పడం, బీజేపీ మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత మోడీ తిండి ఖర్చే దాదాపు 100 కోట్లు దాటిందని అన్నారు. అలాంటిది ఒక కుటుంబం నెలకు దాదాపు రూ. నాలుగు వేలతో ఏలా బతుకుతారో మోడీ ప్రభుత్వం చెప్పాలన్నారు. అంతేకాకుండా అడ్డు అదుపు లేకుండా నిత్యవసర సరుకుల ధరలు పెంచుతూ, సామాన్యులకు బతుకులను భారం చేస్తున్నారన్నారు. బీజేపీ అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలంటే సింగరేణి కాంటాక్ట్ కార్మికులంతా ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త సమ్మెలో భాగస్వాములు కావాలని, కార్మికుల హక్కుల జోలికి వస్తే పోరాటాలతో సమాధానం చెబుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి గట్టు మహేందర్, సంపత్, సమ్మయ్య, శీను, నరేష్, సన్నీ, సురేష్ పాల్గొన్నారు.

విద్యుత్ మోటార్ల దొంగతనాలు జరగకుండా చర్యలు

- జైపూర్ ఏసీపీ బాలసాని మోహన్



నవతెలంగాణ-జైపూర్

వ్యవసాయ బోరుబావులకు సంబంధించిన విద్యుత్ మోటార్లు దొంగతనం కాకుండా పటిష్ఠమైన చర్యలు చేపడుతామని జైపూర్ ఏసీపీ మోహన్ తెలిపారు. మండల పరిధిలో విద్యుత్ మోటార్లు దొంగలించిన వారిని మంగళవారం మీడియా సమావేశంలో హాజరుపర్చారు. ఈ సంధర్భంగా శ్రీరాంపూర్ సీఐ రమేష్‌బాబుతో కలిసి మాట్లాడుతూ గత రెండు మూడు రోజుల నుంచి వ్యవసాయ విద్యుత్ మోటర్లు దొంగతనం జరుగుతున్నట్లు అందిన పిర్యాదు మేరకు కేసులు నమోదు చేసిన జైపూర్ ఎస్సై ఉపేందర్ సిబ్బందితో కలిసి దొంగలను పట్టుకున్నట్లు తెలిపారు. మంగళవారం ఉదయం సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ చేస్తుండగా రసూల్‌పల్లి నుంచి విద్యుత్ మోటర్ల సమాగ్రితో ద్విచక్రవాహణాలపై వెలుతున్న వారిని పట్టుకున్నట్లు తెలిపారు. పోలీసులకు పట్టుబడిన దొంగలు ముగ్గురు రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధి గుడిపేట్ గ్రామ పంచాయతి వెంకటాపూర్‌కు చెందిన వానిగా తెలిపారు. సీతారాంపల్లికి చెందిన అశోక్ అనే వ్యక్తి అమ్మినట్లు తెల్సుకుని విచారించడంతో దొంగలించబడిన విద్యుత్ మోటార్లను ఆయన నుండి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మండల పరిధిలో నమోదైన విద్యుత్ మోటార్ల కేసులకు సంబంధించిన ఐదు మోటార్లు స్వాధీనం చేసుకోవడంతో పాటు నిందితులను చెన్నూర్ కోర్టులో హాజరుపర్చుతున్నట్లు తెలిపారు. విద్యుత్ మోటార్ల దొంగతనం కేసులు నమోదైన వెంటనే సిబ్బందితో కలిసి స్వల్ప వ్యవధితో దొంగలను పట్టుకున్న ఎస్సై ఉపేందర్‌తో పాటు సిబ్బందిని ఈ సంధర్భంగా అభినందించారు. ఈ సమావేశంలో స్థానిక ఎస్సై ఉపేందర్, ఏఎస్సైలు హబీబ్, హజీజ్, కానిస్టేబుళ్లు సుబ్బారావు, సత్యనారాయణ, భాస్కర్ పాల్గొన్నారు.

దుకాణ సముదాయాల్లో 'ఆపరేషన్ స్మైల్'



నవతెలంగాణ-లక్షెట్టిపేట

పట్టణంలోని మున్సిపల్ పరిధిలోగల దుకాణ సముదాయాల్లో మంగళవారం ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై విజయ్ మాట్లాడుతూ ఆపరేషన్ స్మైల్ ముఖ్య ఉద్దేశ్యం అనాద పిల్లలు, బాల కార్మికుల రక్షణకు పనిచేస్తోందని తెలిపారు. మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. భిక్షాటన చేస్తూ ఉన్న పిల్లలను, బాల కార్మికులను గుర్తించి వారిని తల్లిదండ్రులకు అప్పగించడం, లేదా రెస్క్ హోంకు తరలిఇస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా లక్షెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న ముగ్గురు బాల కార్మికులను గుర్తించామని తెలిపారు. వారిలో ఒకరిని తల్లిదండ్రులకు అప్పగించడం జరిగిందని అన్నారు. మిగతా ఇద్దరిని వారి తల్లిదండ్రులకు అప్పగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చిల్డ్రన్స్ వెల్ఫేర్ అధికారి ఇందిర, ఏఎస్సై నాందేవ్, హెడ్ కానిస్టేబుల్ మున్వర్ హుస్సేన్, కానిస్టేబుల్ రవీందర్, డబ్ల్యూబీసీ ప్రమీల పాల్గొన్నారు.

ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో సంబరాలు



నవతెలంగాణ-జన్నారం

విద్యార్థి నాయకుడు, ఉద్యమనేత, ఎన్ఎస్‌యూఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బలమూరు వెంకట్ ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా మంగళవారం మండలంలోని ఎన్ఎస్‌యూఐ కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి సోహెల్‌షా ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకొని సంబరాలు నిర్వహించుకున్నారు. సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్సీ బలమూరు వెంకట్ పార్టీని మరింత బలోపేతం చేస్తూ ఉన్నత పదవులు అధిరోహించాలని కోరుకుంటున్నాం అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు సుభాష్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ రియాజుద్దీన్, కర్ణకర్, పసివుల్లా, రమేష్, రజక్, ఇందయ్యా, ఎన్ఎస్‌యూఐ నాయకులు, గణేష్, రాకేష్, రఘువర్ధన్, రాజేష్, తరుణ్, అజ్మత్, బన్నీ పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా : జాన్సన్ నాయక్



నవతెలంగాణ-జన్నారం

ప్రతి కార్యకర్తకు అండగా నిలుస్తానని బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి భూక్య జాన్సన్ నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని పోనకల్ పీఏసీఎస్ చైర్మన్ రమేష్ ఇటీవల ప్రమాదానికి గురై కాలు ఫ్యాక్చర్ కావడంతో అతనిని పరామర్శించారు. అనంతరం పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించి, వచ్చే ఎంపీ ఎన్నికల్లో ఎంపీ స్థానాన్ని కైవసం చేసుకోవడానికి కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. కార్యకర్తలంతా ఐకమత్యంగా ఉండి వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో ఎంపీ స్థానాన్ని కైవసం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ శేఖర్, పార్టీ మండల అధ్యక్షుడు గుర్రం రాజారాంరెడ్డి జిల్లా నాయకులు సీటిమల భరత్ కుమార్, స్థానిక సర్పంచ్ జక్కు భూమేష్, నాయకురాలు సుశీల పాల్గొన్నారు.

ఏసీబీకి పట్టుబడ్డ మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్, బిల్ కలెక్టర్

- రూ.3,500 లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టివేత



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నిర్మల్ మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్ గంగాధర్, బిల్ కలెక్టర్ నవంత్ ఓ ఇంటి అసెస్మెంట్‌కు సంబంధించి రూ.3,500 లంచం తీసుకుంటూ మంగళవారం ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఏఎన్ రెడ్డి కాలనీలో ఇంటిని నిర్మించుకున్న ఆర్టీసీ కంట్రోలర్ గోపాల్‌రెడ్డి నుండి వీరు లంచం తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్లు తిరుపతి, జాన్‌రెడ్డి పట్టుకున్నారు. తన ఇంటి అసెస్మెంట్ కోసం కొద్ది రోజులుగా మున్సిపల్ ఆఫీసు చుట్టూ తిరుగుతున్న గోపాల్‌రెడ్డిని సదరు రెవెన్యూ ఆఫీసర్, బిల్ కలెక్టర్ రూ. 10వేలు డిమాండ్ చేశారు. ఆయన మొదటి విడతగా రూ.3500 ఇచ్చేందుకు అంగీకారం కుదుర్చుకున్నాడు. అయితే అప్పటికే మున్సిపల్ అధికారుల తీరుతో విసిగిపోయిన గోపాల్‌రెడ్డి ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. గోపాల్‌రెడ్డి లంచం ఇస్తుండగా మున్సిపల్ ఆర్వోను, బిల్ కలెక్టర్‌ను పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన అధికారులు, సిబ్బంది లంచాలు అడిగితే వెంటనే ఏసీబీకి ఫిర్యాదు చేయాలని కోరారు. తమకు సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. నిందితులిద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

పంటలకు సరైన మద్దతు ధర అందిస్తాం

- కందుల కొనుగోలు ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రైతులు పండించిన పంటలకు సరైన మద్దతు ధరను బీజేపీ ప్రభుత్వం మాత్రమే అందించిందని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో కందుల కొనుగోలును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులను ఆదుకునే ఉద్యేశంతో కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఎన్నో పథకాలను ప్రవేశపెట్టిందని అన్నారు. రైతులకు కనీస మద్దతు ధర కోసం కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు రివ్యూ చేస్తోందని అన్నారు. మార్కెట్లో కందుల ధరలు అధికంగా ఉండటంతో దళారుల చేతుల్లో రైతులు మోసపోకుండా కొనుగోలు కేంద్రంలోనే విక్రయించుకోవాలని రైతులకు సూచించారు. ఆదిలాబాద్ నుంచి దాదాపు 50 వేల క్వింటాళ్లు కొనుగోలు టార్గెట్‌గా ఉందన్నారు. త్వరలో మండలాల్లో కూడా కందుల కొనుగోళ్లను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, అధికారులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉపాధ్యాయులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జ్ కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ పట్టణంలోని ప్రజాసేవ భవన్ క్యాంపు కార్యాలయంలో టీఎస్‌ఈఈ ఉపాధ్యాయుని యూనియన్, కార్మిక సంఘమైన ఐఎన్టీయూసీ యూనియన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను కంది ఆవిష్కరించారు. అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఎలాంటి సమస్యలున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి శాయ శక్తుల కృషి చేస్తానని ఆయన భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం

కడెం : మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని ఉప కార్యనిర్వాహణ అధికారి వెంకటరమణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మిషన్ భగీరథ కడెం, ఖానాపూర్ సెగ్మెంట్ 23ఎంఎల్‌డీ నీటి శుద్ధి కేంద్రంలో నిర్వహణ పనుల నిమిత్తం, మిషన్ భగీరథ నీటి సరఫరాకు కడెం, ఖానాపూర్ సెగ్మెంట్ లోని 5 మండలాలు కడెం, ఖానాపూర్, పెంబి, దస్తురాబాద్, జన్నారం, ఖానాపూర్ మున్సిపాలిటీకి 24, 25 రెండు రోజులు మిషన్ భగీరథ నీరు నిలిపి వేయడం జరుగుతుందని తెలిపారు. నీటి వినియోగదారులందరూ సహకరించాలని కోరారు.

ప్రభుత్వ డిగ్రీ గెస్ట్ లెక్చరర్ల సమస్యలు పరిష్కరించాలి

ఉట్నూర్ : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భోదిస్తున్న గెస్ట్ లెక్చరర్ల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర గెస్ట్ లెక్చరర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శంకర్, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్, జావిద్‌లు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పీఎమ్మార్సీలో ఆదిలాబాద్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్‌కు ప్రభుత్వ డిగ్రీ కళాశాల గెస్ట్ లెక్చరర్ల అసోషియేషన్ ఆధ్వర్యంలో సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రతి సంవత్సరం త్రిసభ్య కమిటీ ద్వారా ఎంపికైనవాళ్లమన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భోదిస్తున్న ప్రతి సంవత్సరం గెస్ట్ లెక్చరర్లను ఆటో రెన్యూవల్ చేసి, 12నెలల పాటు కన్సోల్ డేటెడ్ వేతనం అందించి, ప్రతి నెల వేతనం చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో అతిధి అధ్యాపకులు సుధాకర్, దేవన్న, నవీన్, రాజు, కార్తిక్, నారాయణ, నసీర్, దినేష్, చరణ్, స్వామి, స్వప్న, యోగలక్ష్మి పాల్గొన్నారు.

ఆమ్ ఆద్మీ పార్టీ సభ్యత్వ నమోదు

బోథ్ : మండల కేంద్రంలోని మంగళవారం ఆమ్ ఆద్మీ పార్టీ సభ్యత నమోదు కార్యక్రమాన్ని తెలంగాణ కోర్ కమిటీ సభ్యుడు రాథోడ్ సుభాష్ చేతుల మీదుగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలాగే మొదటగా ఆమ్ ఆద్మీ పార్టీ బోథ్ మండల ఇన్‌చార్జి అమీర్ సభ్యత్వాన్ని నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పార్టీ అభివృద్ధి, బలోపేతానికి కృషి చేస్తామన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ గరీబ్ పార్టీ అని అదేవిధంగా ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రంలో బీజేపీ పార్టీని ఓడించి, అధికారంలో రావడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.